




మంగళవారం 18-3-2014

# ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

సిటీ








సంపుటి : 22 సంచిక : 76 | Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Khammam, Kurnool, Tirupathi, Karimnagar, Rajahmundry, Srikakulam and Ongole | 10 + 12 పేజీలు వెల : 3.00 | www.prajasakti.com


## టిడిపి, బిజెపి వైపు జనసేన అడుగులు!

### పవన్‌ను కలిసిన కమలం దూత ?

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర రాజకీయ రంగంపైకి కొత్తగా వచ్చిన జనసేన పార్టీ అడుగులు టిడిపి, బిజెపి కూటమివైపే పడుతున్నట్లు సమాచారం. ఈ దిశలో ఇప్పటికే కసరత్తు ప్రారంభమైనట్లు తెలిసింది. బిజెపి పొత్తుల వ్యూహాన్ని ఖరారు చేయడానికి హైదరాబాద్‌కు వచ్చిన ఆ పార్టీ అధికార ప్రతినిధి ప్రకాశ్ జవదేకర్ ఈ విషయమై ప్రత్యేకంగా దృష్టి సారించారు. టిడిపితో పొత్తు విషయమై స్థానికంగా చర్చలు జరిపిన ఆయన పవన్‌కళ్యాణ్ వద్దకు వద్దకు కూడా ఒక దూతను పంపినట్లు తెలిసింది. బిజెపి ప్రతిపాదనపై పవన్‌కూడా సానుకూలంగానే స్పందించినట్లు చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే బిజెపి ప్రధానమంత్రి అభ్యర్థి మోడితో కూడా పవన్ భేటీ కానున్నారని ప్రచారం జరుగుతోంది. సాధ్యమైనంత త్వరగానే ఈ సమావేశం జరిగే అవకాశం ఉందని సమాచారం. మోడిని కలిసిన తరువాతే టిడిపి, బిజెపిని బలపరిచే విషయాన్ని పవన్‌కళ్యాణ్ అధికారికంగా ప్రకటించే అవకాశం ఉందని భావిస్తున్నారు. జనసేన సిద్ధాంతంపై రాసిన ఇజమ్ పుస్తకాన్ని ఆవిష్కరించే తేదిని ఆయన ఇంకా అధికారికంగా ఖరారు చేయలేదు. మరోవైపు విశాఖపట్నంలో ఆ పార్టీ భారీ బహిరంగ సభ నిర్వహించడానికి సిద్ధమవుతోందని సమాచారం.




## మలేసియా విమాన పైలట్ ఆత్మహత్య ?

కౌలాలంపూర్ : వారం రోజులుగా ఆచూకీ లేకుండా పోయిన మలేసియా విమానం ఎంహెచ్ 370లోని ఇద్దరు పైలట్లలో ఒకరు ఆత్మహత్య చేసుకొని ఉండొచ్చని దర్యాప్తు అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఆ దిశలో దర్యాప్తును సాగిస్తున్నారు. కాగా విమానం కాక్‌పిట్ నుంచి 'ఆల్‌రైట్ ..గుడ్‌నైట్ ' అని సహ పైలట్ ఫరీఖ్ అబ్దుల్ హమీద్ మాట్లాడినట్లు మలేసియా ఎయిర్‌లైన్స్ సిఇఒ అహ్మద్ జౌహరి యాహ్యా పాత్రికేయులతో చెప్పారు.

ఉద్దేశపూర్వక చర్యే.. 9లో



# ఛార్జీలు పెంచాలా? వద్దా?

ఇసి అభిప్రాయం కోరిన ఇఆర్‌సి

అనుమతిస్తే రూ.9320 కోట్ల విద్యుత్ భారం

ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విద్యుత్ ఛార్జీల పెంపుపై ఉత్కంఠ నెలకొంది. విద్యుత్ ఛార్జీల పెంపునకు ఎన్నికల కోడ్ వర్తిస్తుందా? లేదా? స్పష్టత ఇవ్వాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి భన్వర్‌లాల్ అభిప్రాయం చెప్పాలని ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఎపిఇఆర్‌సి) లేఖ రాసింది. భన్వర్‌లాల్ దీనిపై ఏ నిర్ణయం తీసుకుంటారోనని అటు అధికారులు, ఇటు వినియోగదారులు ఎదురుచూస్తున్నారు. భన్వర్‌లాల్ నుంచి అనుమతి వచ్చిన వెంటనే విద్యుత్ ఛార్జీల బాదుడుకు రంగం సిద్ధమవుతుంది. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి కొత్త ఛార్జీల భారం అమల్లోకి వస్తాయి. విద్యుత్తు ఛార్జీల టారిఫ్‌ని ఈనెల 23వ తేదీన విడుదల చేయడానికి ఎపిఇఆర్‌సి ఏర్పాట్లు చేస్తోంది. 2014-15 ఆర్థిక సంవత్సరంలో విద్యుత్తు ఛార్జీలు అమలుకు సంబంధించి నాలుగు విద్యుత్తు పంపిణీ సంస్థలు కలిపి రూ.9320 కోట్లు ప్రజల నుంచి వసూలు చేయాలని ఎపిఇఆర్‌సికి ప్రతిపాదనలు సమర్పించిన విషయం తెలిసిందే. దీనిపై నాలుగు డిస్కంల పరిధిలో బహిరంగ విచారణలు కూడా జరిగాయి. విద్యుత్ ఛార్జీల పెంపు ప్రతిపాదనలను నిరసిస్తూ ప్రజలు, రాజకీయ పార్టీలు పెద్దఎత్తున ఉద్యమించాయి. డిస్కంల ప్రతిపాదనలను తీవ్రంగా వ్యతిరేకించాయి. విద్యుత్ ఛార్జీల పెంపు నిర్ణయం ప్రకటించే దశలో ఎన్నికల కోడ్‌పై స్పష్టత రావాల్సి ఉంది. ఇసి అనుమతి ఇవ్వకపోతే విద్యుత్ ఛార్జీల పెంపు నిర్ణయం వాయిదా పడుతుంది. విద్యుత్ వినియోగదారులకు తాత్కాలిక ఉపశమనం కలుగుతుంది. ఎపిఇఆర్‌సి నిబంధనల ప్రకారం మార్చి 31వ తేదీతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అమలవుతున్న విద్యుత్ ఛార్జీల గడువు పూర్తవుతుంది. ఏప్రిల్ 1 నుంచి కొత్త ఛార్జీలు అమలు కావాల్సి ఉంది. ఈ అంశంపై ఎన్నికల సంఘంతో ఎపిఇఆర్‌సి మరోమారు చర్చించే అవకాశముంది.

విభజన వేళ... రెండు టారిఫ్‌లు... 7

# వలసలే గొప్ప!

### తలుపులు బార్లా ◆ పార్టీలు బోర్లా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎన్నికలు ముంచుకొస్తున్నా రాజకీయ పార్టీలు వలసనేతల వైపే చూస్తున్నాయి. జనక్షేత్రంలో ప్రజల సమస్యలు ప్రస్తావించడం కన్నా ఇతర పార్టీల నుండి వచ్చే నాయకులకు రెడ్ కార్పెట్ పరచడమే గొప్పగా పార్టీలు చెప్పుకోవడం చర్చనీయాంశంగా మారింది. నియోజకవర్గాల స్థాయినుండి మ్యానిఫెస్టోలు తయారుచేసి ప్రతి సమస్యకు పరిష్కారం చూపుతామని ప్రకటించిన తెలుగుదేశం పార్టీ సీమాంధ్రలో ఈ రేసులో తెలంగాణ ప్రాంతంలో టిఆర్‌ఎస్‌కూడా ఇదే జోరు కొనసాగిస్తోంది. ఆ ప్రాంతంలో కాంగ్రెస్ కూడా వలస నేతలకు స్వాగతం పలకడానికి సై అంటోంది. సీమాంధ్ర ప్రాంతంలో కాంగ్రెస్ పార్టీ దాదాపు ఖాళీ అయ్యే పరిస్థితి ఏర్పడింది. కొద్దిరోజుల కిందటి వరకు తమపై దుమ్మెత్తిపోసిన వారికే పసుపు కండువాలను కప్పడంలో బిజీగా మారిన ఆ పార్టీ అధినేత చంద్రబాబునాయుడు ఆ నాయకుల చేరికతో టిడిపి బలోపేతమైందని నమ్మబలుకుతున్నారు. అయితే, క్షేత్రస్థాయి కార్యకర్తలు అది బలుపా, వాపా తేల్చుకోలేని పరిస్థితుల్లో చిక్కుకున్నారు. ఎన్నికల ముందు హడావిడిగా గోడ దూకి వస్తున్న నేతలకు వ్యతిరేకంగా ఎక్కడికక్కడ టిడిపి శ్రేణులు గళం విప్పుతున్నా ప్రస్తుతం వాటిని పట్టించుకునే స్థితిలో చంద్రబాబు లేరు. సోమవారం ఒక్కరోజే పలువురు కాంగ్రెస్ నాయకులను ఆయన టిడిపిలోకి చేర్చుకున్నారు. అనంతపురం కాంగ్రెస్ ఎంఎల్‌సి తిప్పేస్వామి, గుంతకల్లు ఎంఎల్‌ఏ మధుసూధన్, సీనియర్ నాయకురాలు కుతూహలమ్మ తదితరులు టిడిపిలో చేరారు. మరోవైపు గుంటూరుకు చెందిన కాంగ్రెస్ ఎంపి రాయపాటి సాంబశివరావు టిడిపిలో చేరడం ఖాయమన్న వార్తలు వస్తున్నాయి. ఆయనకు నరసరావుపేట లోక్‌సభ సీటును ఖరారు చేసినట్లు సమాచారం. ప్రస్తుతం నరసరావుపేట లోక్‌సభ స్థానం నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న మోదుగుల వేణుగోపాల్‌రావును ఈ సారి అసెంబ్లీ

4లో




తెలుగు దేశంలో చేరుతున్న మాజీ మంత్రి కుతూహలమ్మ..

9లో..

## నేడు విభజన బృందం రాక

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో విభజన ప్రక్రియ జరుగుతున్న తీరును పరిశీలించి, అవసరమైన సూచనలు చేసేందుకు కేంద్ర బృందం మంగళవారం హైదరాబాద్‌కు రానుంది. కేంద్ర హోంశాఖ కార్యదర్శి అనిల్‌గోస్వామి నేతృత్వంలోని ఈ బృందం రెండు రోజుల పాటు రాష్ట్ర రాజధానిలో బసచేయనుంది. ప్రధానంగా ఐఎఎస్, ఐపిఎస్ స్థాయి ఉద్యోగుల విభజనకు సంబంధించిన వ్యవహారాలను ఈ బృందం పర్యవేక్షించనుంది. దీంతో పాటు రాష్ట్ర స్థాయి ఉద్యోగుల వ్యవహారంతో పాటు విభజనకు ప్రక్రియకు సంబంధించిన ఇతర అంశాల పని కూడా ఎంతవరకైందో ఈ బృందం పరిశీలించనుంది. మంగళవారం నాడు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో సమావేశమైన అనంతరం ఇప్పటికే ఏర్పాటు చేసి ఉన్న 15 కమిటీలతోనూ బృంద సభ్యులు చర్చించనున్నారు. ఆ తరువాత డిజిపి,ఇతర పోలీస్ అధికారులతోనూ సమావేశం కానున్నారు. చివరగా గవర్నర్ నరసింహన్‌ను కూడా బృంద సభ్యులు కలవనున్నారు. జూన్2 నాటికి పాలనా పరంగా విభజన ప్రక్రియ పూర్తికావాల్సిఉండటంతో ఆ దిశలో పనులు వేగవంతంగా నడిపించడమే తాజా కమిటీ ప్రధాన లక్ష్యం.



# జిల్లాల్లో బహిరంగసభలు



### సీమాంధ్రలో బస్సుయాత్ర ◆ రెండు పిసిసిల ఎన్నికల వ్యూహం

ప్రజాశక్తి - హైదరాబాద్‌బ్యూరో

తెలంగాణా, సీమాంధ్ర ప్రాంతాలకు రెండు పిసిసిలు ఏర్పడడంతో ఆ రెండు కమిటీలు ఇక ఎన్నికల ప్రచారంలో దృష్టి పెట్టాయి. వేర్వేరుగానే ఎన్నికల ప్రచారానికి కసరత్తు మొదలుపెట్టాయి. త్వరలో తెలంగాణాలోని పది జిల్లాలో బహిరంగసభలు, సీమాంధ్రలోని పదమూడు జిల్లాలో బస్సుయాత్ర ఏర్పాటు చేయాలని నిర్ణయించాయి. ఈ మేరకు రెండు కమిటీల ప్రచార కమిటీలు ఆది, సోమవారాల్లో సమావేశమై ప్రచారానికి సంబంధించి కార్యాచరణను సిద్ధం చేశాయి. తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగానే నిర్ణయం తీసుకుంటానని ఇచ్చిన మాట ప్రకారం సోనియాగాంధీ తెలంగాణ ఇచ్చారని, ఆ నినాదాన్నే ప్రజల్లోకి వెళ్లి ఎన్నికల్లో లబ్ధి పొందాలని తెలంగాణా కాంగ్రెస్ నేతలు భావించారు. దానికోసం పది జిల్లాలో సోనియాగాంధీకి కృతజ్ఞత చెబుతూ బహిరంగసభలు ఏర్పాటు చేయాలని, ఆ సభలకు సోనియాగాంధీ, ఇతర కేంద్రనేతలను ఆహ్వానించాలని నేతలు గతంలో నిర్ణయించారు. తెలంగాణాలో నిర్వహించబోయే సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ హాజరవుతారని తెలంగాణా నేతలకు కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జీ దిగ్విజయ్‌సింగ్ హామీ ఇచ్చారు. అందులో భాగంగా కొత్తగా ఏర్పాటైన తెలంగాణా పిసిసి ఎన్నికల ప్రచార కమిటీ ఆదివారం ఛైర్మన్ దామోదర రాజనర్సింహ, పిసిసి అధ్యక్షులు పొన్నాల లక్ష్మయ్య అధ్యక్షతన సమావేశమై బస్సుయాత్రలకు రంగం సిద్ధం చేసింది. ఎన్నికల ప్రణాళిక సిద్ధమైన వెంటనే బస్సుయాత్రలు పెట్టాలని అనుకున్నారు. హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, మెదక్ సభలకు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీలను కాంగ్రెస్‌నేతలు ఆహ్వానించారు. టిఆర్‌ఎస్ మద్దతు ఇచ్చినా ఇవ్వకున్నా తెలంగాణా ప్రాంతంలో అధికసీట్లు గెలచుకుని అధికారం చేపట్టాలని ఆ పార్టీ నేతలు గట్టిగా ప్రయత్నాలు చేస్తున్నారు. అదేవిధంగా సీమాంధ్ర కాంగ్రెస్ నేతలు కూడా బస్సుయాత్రకు ప్రణాళిక సిద్ధం చేశారు. విభజన నేపథ్యంలో సీమాంధ్ర ప్రాంతంలో కాంగ్రెస్‌పార్టీ తుడిచిపెట్టుకుపోయింది. ఆ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలందరూ సగానికిపైగా ఇతర పార్టీల తీర్థం పుచ్చుకున్నారు. ద్వితీయశ్రేణి నాయకులు కూడా కాంగ్రెస్‌పార్టీని ఖాళీ చేశారు. ఈ తరుణంలో సోమవారం ఆంధ్రప్రదేశ్ పిసిసి ఎన్నికల ప్రచార కమిటీ సమావేశమైంది. పిసిసి అధ్యక్షులు రఘువీరారెడ్డి, చిరంజీవి అధ్యక్షతన జరిగిన సమావేశంలో బస్సుయాత్రలు చేపట్టాలని అనుకున్నారు. సీమాంధ్ర ప్రాంతంలో కాంగ్రెస్‌పార్టీకి పునర్వైభవం తీసుకురావడంతో పాటు విభజన తర్వాత పదమూడు జిల్లాలతో ఏర్పడబోయే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమన్న విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ఈ సందర్భంగా సీమాంధ్రకు కేంద్ర ప్రకటించిన ప్యాకేజీ, ఇతర పార్టీల విధానాలను విస్తృతంగా ప్రచారం చేయాలని భావించారు.

శ్రీకాకుళం నుంచి అనంత వరకు బస్సుయాత్ర : చిరంజీవి 4

# సైకిల్‌తో పొత్తుకు కమలం తహతహ

### సీఎం రమేష్‌తో జవదేకర్ మంతనాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రానున్న శాసనసభ, లోక్‌సభ ఎన్నికల్లో టిడిపితో పొత్తు పెట్టుకునేందుకు బిజెపి తహతహలాడుతోంది. తెలంగాణతోపాటు సీమాంధ్రలోనూ టిడిపితో ఎన్నికల సర్దుబాట్లు చేసుకోవటం ద్వారా ఎక్కువ లోక్‌సభ స్థానాలను కైవలం చేసుకోవాలని కమలనాథులు భావిస్తున్నారు. ఇందులో భాగంగానే బిజెపికి చెందిన జాతీయ నాయకులు తరచూ హైదరాబాద్‌కు వచ్చి టిడిపి నేతలతో చర్చలు జరుపుతున్నారు. తాజాగా బిజెపి జాతీయ అధికార ప్రతినిధి ప్రకాశ్ జవదేకర్, టిడిపి రాజ్యసభ సభ్యుడు సీఎం రమేష్‌తో ఈ విషయమై ఎడతెగని మంతనాలు జరిపినట్లు సమాచారం. పొత్తులపై చర్చించేందుకోసం జవదేకర్ ఆదివారం హైదరాబాద్‌కు వచ్చారు. ఒక ప్రయివేటు హోటల్‌లో బసచేసిన ఆయన సోమవారం సాయంత్రం వరకూ సీఎం రమేష్‌తో పలుమార్లు భేటీ అయ్యారని తెలిసింది. వీరిద్దరి చర్చల్లో పొత్తులు, సీట్ల కేటాయింపులు, వివిధ స్థానాల్లో ఇరు పార్టీల బలాబలాలు, నాయకులు గెలిచేందుకు ఉన్న



అవకాశాలు తదితరాంశాలు ప్రస్తావనకు వచ్చాయి. అయితే ఏ పార్టీ ఎన్ని స్థానాల్లో పోటీ చేయాలనే విషయం ఇతమిద్ధంగా తేల్లేదు. దీంతో మరిన్ని సార్లు చర్చలు జరపాలని వారు నిర్ణయించారు. సీఎం రమేష్‌తో జరిగిన చర్చల సారాంశాన్ని తమ పార్టీ జాతీయ అధ్యక్షుడు రాజ్‌నాథ్‌సింగ్‌కు తెలియజేస్తానని ఈ సందర్భంగా జవదేకర్ అన్నట్లు తెలిసింది. వారం, పది రోజుల్లో మరోసారి భేటీ అయి, పొత్తులపై ఒక నిర్ణయం తీసుకోవాలని ఇరు పార్టీల నాయకులు భావిస్తున్నట్లు సమాచారం.

బిజెపి చేరిన సుధీష్ రాంభట్ల 7






## 11 కిలోల బంగారం పట్టివేత

భారీ మొత్తంలో నగదు స్వాధీనం

ప్రజాశక్తి-యంత్రాంగం

ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పోలీసులు నిర్వహిస్తున్న తనిఖీల్లో భారీగా నగదు, బంగారం పట్టుబడుతోంది. సోమవారం నిజామాబాద్ జిల్లా సదాశివనగర్ ఎంపిడిఓ కార్యాలయ సమీపంలోగల 44వ జాతీయ రహదారిపై వాహనాలను తనిఖీ చేస్తుండగా 99వేలా 500 రూపాయలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పశ్చిమ గోదావరి జిల్లా పెదపాడులోని కలపర్రు టోల్‌గేట్ వద్ద రూ.7.5 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. ఉండ్రాజవరానికి చెందిన బూరుగుపల్లి చిన్నారావు కారులో ఈ నగదును తరలిస్తుండగా ఆధారాలు లేకపోవడంతో పోలీసులు పట్టుకున్నారు.

నెల్లూరు జిల్లా మూలాపేట చెక్‌పోస్టు వద్ద పోలీసులు తనిఖీ చేయగా, కారులో సుమారు 11 కిలోల బంగారం పట్టుబడింది. సరైన ఆధారాలు లేనందున బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. కడప జిల్లా చిన్నమండెం మండలం కేశపురం వద్ద తనిఖీల్లో బస్సులో ఓ వ్యక్తి వద్ద రూ.20 లక్షలు పట్టుబడింది.

వరంగల్ జిల్లా జనగామ మండలం పెంబర్తి చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీల్లో భాగంగా 250 కిలోల జిలెటిన్ స్టిక్స్‌ను పోలీసులు పట్టుకున్నారు. భువనగిరి నుండి జనగామ మీదుగా ఆరేపల్లికి తరలిస్తుండగా పట్టుబడినట్లు సిఐ నర్సింహారావు తెలిపారు. 25 కిలోల సామర్థ్యం గల పది బాక్స్‌లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎలాంటి ధ్రువపత్రాలు వారి వద్ద లేకపోవడంతో కేసు నమోదు చేసి జిలెటిన్ స్టిక్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.



## ఖరగ్‌పూర్ ఐఐటిలో రాష్ట్ర విద్యార్థి ఆత్మహత్య

శోకసంద్రంలో శ్రవణ్ కుటుంబ సభ్యులు

10




ప్రచారం.. డబ్బు పంచడం.. ముందుపోయిందం.. ఓట్లను కొనడం అంతా డబ్బే సార్.. గెలిచినోళ్లని కొనెద్దాం..!!

# 8మంది మృతి

### ఆరుగురు గల్లంతు ◆ హోలి వేడుకల్లో విషాదం

ప్రజాశక్తి - యంత్రాంగం

హోలీ వేడుకలు పలు జిల్లాల్లో విషాదాన్ని మిగల్చాయి. వేర్వేరు ఘటనల్లో 8 మంది మృతి చెందగా మరో ఆరుగురు గల్లంతయ్యారు. వీరిలో ఎక్కువగా విద్యార్థులే కావడంతో కుటుంబాల్లో తీరని విషాదం నిండింది. కరీంనగర్ జిల్లా కమాన్‌పూర్ మండలం నాగెపల్లి గ్రామానికి చెందిన ఎంబిఎ విద్యార్థి, టిఆర్‌ఎస్‌వి మండల అధ్యక్షుడు తీగల కుమార్ (23), సూత్రాల శివ (19) వేడుకల అనంతరం నదిలోకి స్నానానికి దిగారు. లోతు అంచనా వేయలేకపోవడంతో అందులోనే మునిగి గల్లంతయ్యారు. మంథని సిఐ మడద రమేష్, ఎస్‌ఐ ఉపేందర్ సంఘటనా స్థలానికి చేరుకుని గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. సాయంత్రం వరకు వెతికినా వారి ఆచూకీ కనిపించలేదు. బాధిత కుటుంబాలను పలు పార్టీల నాయకులు పరామర్శించారు. మరో ఘటనలో రామడుగు మండల కేంద్రానికి చెందిన వీరయ్య కుమార్తె పూజ(4) ఇతర పిల్లతో కలిసి రంగులు చల్లుకుంటుండగా ట్రాక్టర్ ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన చిన్నారిని కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ మృతిచెందింది. వేడుకల్లో పాల్గొనొద్దని తల్లి అన్నందుకు ఇదే మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామంలో సాయికృష్ణ(14) వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదిలాబాద్ జిల్లా జైపూర్ మండలంలోని వెంకట్రావుపల్లికి చెందిన దుర్గం రాగయ్య(48) రంగులు చల్లుకున్న అనంతరం గ్రామ శివారులోని చెరువులో స్నానానికెళ్లి ఈతరాక మృతిచెందాడని ఎస్‌ఐ శ్రీలత తెలిపారు.

మృతుల్లో విద్యార్థులే... 4

## రష్యాలో చేరేందుకు క్రిమియా దరఖాస్తు

మాస్కో : క్రిమియా పార్లమెంట్ ఆ ప్రాంతాన్ని సోమవారం స్వతంత్ర రాష్ట్రంగా ప్రకటించుకుంది. ఉక్రెయిన్ నుంచి విడిగొట్టి రష్యాలో కలిపేందుకు క్రిమియా స్థానికులు ఓటు వేశారు. చారిత్రాత్మకమైన రెఫరెండాన్ని క్రిమియా స్థానికులు ఆమోదించడంతో ఉక్రెయిన్ నుంచి క్రిమియా స్వాతంత్ర్యం ప్రకటించుకుంది. తిరిగి రష్యాలో చేరేందుకు దరఖాస్తు చేసుకుంది. 20 సంవత్సరాల క్రితం సోవియట్ యూనియన్ కుప్పకూలిన తరువాత, 97 శాతం మంది ఓటర్లు తిరిగి రష్యాతో కలిపేందుకు 'ఓకే' చెప్పారు. క్రిమియాలో 1.5 మిలియన్ అర్హత ఓటర్లు ఉండగా, రికార్డు స్థాయిలో 83 శాతం రెఫరెండంలో పాల్గొన్నారు.

చిన్న క్రిమియా - పెద్ద సమస్య 3

# ఎందుకీ హడావుడి!

### 'మీ అభ్యర్థి మీ ఇష్టం'పై పెదవి విరుస్తున్న టిడిపి శ్రేణులు

ప్రజాశక్తి ప్రతినిధి - తిరుపతి జోన్

'మీకు నచ్చిన వ్యక్తే తెలుగుదేశం అభ్యర్థి' పేరుతో కార్యకర్తల అభీష్టం మేరకే అభ్యర్థులను ఎంపిక చేస్తామని తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు ప్రకటించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని ఫోన్ల ద్వారా కార్యకర్తల అభిప్రాయం తెలుసుకుని అభ్యర్థులను ఎంపిక చేస్తానని ఆయన చెబుతున్నారు. ఇది వినడానికి బాగానే ఉన్నా... 'నిజంగా తెలుగుదేశం పార్టీలో అంత ప్రజాస్వామ్యబద్ధంగా అభ్యర్థుల ఎంపిక జరిగే పరిస్థితి ఉందా' అని ప్రశ్నిస్తే.. అదంతా వృథా ప్రయాసేనని తెలుగుదేశం పార్టీ శ్రేణులే కొట్టిపారేయడం గమనార్హం. ఇప్పటికే చాలా నియోజకవర్గాల్లో తెలుగుదేశం అభ్యర్థులెవరో ఖరారైపోయింది. ప్రచారం కూడా మొదలుపెట్టేశారు. ముందు నుంచి పార్టీలో కొనసాగుతున్నవారు కొందరైతే, కొత్తగా పార్టీలోకి వలసొచ్చిన వారు ఇంకొందరు. వీరంతా అభ్యర్థులుగా చెలామణిలో ఉన్నారు. ఉదాహరణకు చిత్తూరు జిల్లా తీసుకుంటే... శ్రీకాళహస్తిలో బొజ్జల గోపాల క్రిష్ణారెడ్డి, నగరిలో ముద్దుక్రిష్ణమనాయుడు, కుప్పంలో చంద్రబాబు నాయుడు, చంద్రగిరిలో కొత్తగా పార్టీలో చేరిన మాజీ మంత్రి గల్లా అరుణ కుమారి... అభ్యర్థులుగా రంగంలో ఉన్నారు. మిగిలిన నియోజకవర్గాల్లోనూ.... అభ్యర్థులు సిద్ధంగా ఉన్నారు. తిరుపతిలో మాజీ ఎంఎల్‌ఏ ఎం.వెంకటరమణ కాంగ్రెస్ నుంచి తెలుగుదేశంలో చేరనున్నారు. టికెట్టిస్తేనే ఆయన పార్టీలో చేరతారు.. లేకుంటే లేదు. ఇక ఇక్కడ కార్యకర్తల అభిప్రాయానికి విలువేముంటుంది? తంబళ్లపల్లి నుంచి శంకర్ పార్టీలో చేరనున్నారు. టికెట్టు హామీ ఇస్తేనే పార్టీలో చేరతారు. లేదంటే లేదు. గంగాధర నెల్లూరులో గుమ్మడి కుతూహలమ్మ టిడిపిలో చేరారు. ఆమెకూ టికెట్టివ్వాల్సిందే... ఎక్కడైనా ఇదే పరిస్థితి. అలాంటప్పుడు 'మీ అభ్యర్థి... మీ ఇష్టం' అనే కార్యక్రమానికి ప్రాధాన్యతేమంటుందని తెలుగుదేశం కార్యకర్తలే ప్రశ్నిస్తున్నారు.

గతంలోనూ ఇదే తరహాలో బాబు.. 4